ప్రజాశక్తి
శుక్రవారం 30 మే 2025
5
అల్లూరి సీతారామరాజు

అభ్యర్థులకు మౌఖిక పరీక్ష

ప్రజాశక్తి -పాడేరు : స్త్రీ, శిశు సంక్షేమ శాఖలోని వివిధ విభాగాలలో ఖాళీగా ఉన్న సోషల్ వర్కర్, ఫుట్ రీచ్ వర్కర్, మేనేజర్, డాక్టర్, సైకో సోషల్ కౌన్సిలర్, సెక్యూరిటీ గార్డ్, ఎడ్యుకేటర్, తదితర పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలించి అర్హులకు మౌఖిక పరీక్ష నిర్వహించడం జరిగిందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పిడి ఎన్. సూర్యలక్ష్మి తెలిపారు. మౌఖిక పరీక్ష ద్వారా పేనల్ అభ్యర్థుల ప్రోవిజినల్ జాబితాను జిల్లా కలెక్టర్ కు సమర్పించడం జరిగిందని, కలెక్టర్ ఆమోదంతో నియామక పత్రాలు జారీ చేయడం జరుగుతుందని వివరించారు. మౌఖిక పరీక్ష నిర్వహణలో గిరిజన సంక్షేమ ప్రత్యేక ఉప కలెక్టర్ ఎంవి ఎస్ లోకేశ్వర రావు, డిఎస్పీ షేక్ సహబాజ్ అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నలు అడుగుతున్న అధికారులు

స్పెషల్ డిఎస్‌సి కోసం జీపుజాతా

▸▸31న సీతంపేటలో ప్రారంభం ▸▸ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ టీచర్స్ పోస్టులు మినహాయించి గిరిజన ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు.గురువారం అరకులోయ మండల కేంద్రంలోని ఆదివాసి గిరిజన సంఘం భవనంలో జీపుజాతా పోస్టర్ ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మెగా డిఎస్సిలో గిరిజన ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతంలో గతంలో ఉన్న జిఓ నెం 3ని సుప్రీంకోర్టు రద్దు చేయడంతో గిరిజన ప్రాంతంలో రూల్ అఫ్ రిజర్వేషన్ అమలు చేయడం వలన గిరిజన నిరుద్యోగ యువతకు తీవ్రంగా నష్టం జరిగిందన్నారు.ఈ మెగా డిఎస్సిలో గిరిజన ప్రాంతానికి కేటాయించిన పోస్టులను మినహాయించి గిరిజన ప్రాంతానికి ప్రత్యేక ఆర్డినేన్స్ తీసుకొచ్చి గిరిజన స్పెషల్ డిఎస్సి ద్వారా నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, మెగా డిఎస్సిలో గిరిజన ప్రాంత పోస్టులు మినహాయించాలని అనేక రూపల్లో ఆదివాసీ గిరిజన సంఘం, వివిధ ప్రజా సంఘాలు ఆందోళన నిరసన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శుల ఆధ్వర్యంలో ఈ నెల 31న సీతంపేటలో ఉదయం 11 గంటలకు జీపుజాతా ప్రారంభం కానుందని, అరకు జూన్ 2తేదీన చేరుకొని జూన్ 4న కెఆర్ పురం ఐటిడిఏ వద్ద ముగింపు సభ ఉంటుందన్నారు. ఈ జీపుజాతాను గిరిజన యువత, ప్రజానికం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జి బాబు, నాయకులు టి.జోషి పాల్గొన్నారు.


జీపు జాతా పోస్టర్ ఆవిష్కరిస్తున్న కిల్లో సురేంద్ర, నాయకులు

ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలి

దీక్షలో కూర్చున్న రామారావు, తదితరులు

ప్రజాశక్తి రంపచోడవరం :
ఆదివాసీ ప్రత్యేక డిఎస్‌పిపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ప్రకటించాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు డిమాండ్ చేశారు. ప్రత్యేక డిఎస్‌సి కోసం ఆదివాసీ జెఎసి ఆధ్వర్యాన నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 15వ రోజుకు చేరాయి. ఈ దీక్షలకు సంఘీభావం తెలియజేసిన లోతా రామారావు మాట్లాడుతూ 2025 మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ ప్రాంత ఆదివాసీ టీచర్స్

ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

పోస్టులు మినహాయించి, తక్షణమే 100 శాతం స్థానిక ఆదివాసీ పట్టభద్రులతోనే భర్తీ చేసేందుకు ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ నోటిఫికేషన్స్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై తక్షణమే ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ (టిఏసి) ఏర్పాటు చేసి తీర్మానం చేయాలని కోరారు. షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలని, జీవో నెంబర్ 3కు చట్ట బద్ధత కల్పిస్తామని ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సిరిమల్లి రెడ్డి, మండల కార్యదర్శి తీగల శ్రీనివాస్, శారపు నాగేశ్వరరావు, అడ్వకేట్ పండా సిద్ధార్థ దొర, కుంజం వెంకన్న దొర, కంగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీని చంద్రబాబు నిలబెట్టుకోవాలి

విఆర్.పురం : జిఒ 3ను పునరుద్ధరించి 100 శాతం ఉద్యోగాలు స్థానిక గిరిజనులకు ఇస్తామని 2024 ఎన్నికల సందర్భంగా అరకు సభలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి పులి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం రేఖపల్లి, రాజుపేట, వడ్డిగూడెం సచివాలయాల ముందు సంఘం ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. అనంతరం సచివాలయ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ స్పెషల్ డిఎస్‌సి కోసం ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అనేక ఉద్యమాలు జరిగిన ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. ఇలాగే వ్యవహరిస్తే సచివాలయాలతో మొదలైన ఉద్యమం ఉధృతం చేస్తామని, దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు తుర్రం బాబురావు, సోయం చినబాబు, సున్నం రాజు, పోడియం శ్రీరామ్మూర్తి, చిక్కాల రామారావు, కుంజ కన్నయ్య, సోడి మల్లయ్య, ఆత్మకూరి కాంతారావు, బీరబోయిన గౌతం తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రిలే నిరాహార దీక్షలు చేస్తున్న సిపిఎం నాయకులు, స్థానికులు

గుండాలలో రోడ్లు నిర్మించాలని
సిపిఎం రిలే నిరాహార దీక్ష ప్రారంభం

ప్రజాశక్తి-ఎటపాక
మండలంలోని గుండాల పంచాయితీలో రోడ్ల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గుండాల సచివాలయం ముందు గురువారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ దీక్షలను సిపిఎం ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుండాల ఇసుక ర్యాంపు ద్వారా పంచాయితీకి కోట్లాది రూపాయల నిధులు రావలసి ఉందని, కానీ అధికారులు ఆ నిధులు కేటాయించకుండా, అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యంగా విడిచిపెట్టారని తెలిపారు. 15 సంవత్సరాలుగా రోడ్లు వేయకపోవడంతో గుంతలు పడిన రోడ్లపై వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రజాప్రతినిధులు గాని, అధికారులుగాని పట్టించుకోకపోవడం చాలా దారుణమన్నారు. గత ప్రభుత్వం ఉన్న సమయంలో కూడా సిపిఎం నిరాహార దీక్షలు, రాస్తారోకోలు చేసి సమస్యలు పరిష్కరించాలని పోరాడిందని గుర్తు చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్ల సమస్యను త్వరగా పరిష్కరించకపోతే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రిలే నిరాహార దీక్షలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఐవి, పార్టీ మండల కమిటీ సభ్యులు ఇరపా సత్యం, జి.హుస్సేన్, గుండాల కాలనీ శాఖ కార్యదర్శి తోట శ్రీను, నాయకులు ఎన్.సుధాకర్, పసుపులేటి ప్రవీణ్, మందా జగదీష్, ములకల నాగరాజు, సత్యవతి, కొండమ్మ, వెంకటలక్ష్మి, రమణ, రాధా, రోజా, అన్నపూర్ణ, షాజహాన్, గోసుల నాని. ఐ.పద్మ, జి.హరి, సీసం అర్జున్, రాసాల సాయి పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపుపై లోతా రామారావు హర్షం

అడ్డతీగల మండల కేంద్రంలోనూ అక్రమ కట్టడాలు తొలగించాలని డిమాండ్

ప్రజాశక్తి-రాజవొమ్మంగి
రంపచోడవరం, మారేడుమిల్లి మండల కేంద్రాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించి కట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించడాన్ని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం స్వాగతిస్తుందని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే రంపచోడవరం, మారేడుమిల్లి కేంద్రంలోనే కాకుండా మిగతా మండల కేంద్రంలో ఆక్రమ కట్టడాలు, ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని వ్యాపారాలు చేసుకుంటున్న గిరిజనేతరుల మీద చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే అడ్డతీగల మండల కేంద్రంలో రోడ్డుకి ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను తక్షణమే తొలగించాలని కోరారు.

రాళ్లు తేలిన రహదారి

రాళ్లు తేలిన రోడ్డు

-వాహనదారులకు తప్పని ఇక్కట్లు - పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని శిరగం పంచాయతీ వెళ్ళే రోడ్డు అధ్వానంగా తయారైంది. కంకర తేలి ప్రమాదకరంగా మారింది. కనీసం నడవడానికి కూడా ప్రజలు ఇబ్బంది పడుతున్న పరిస్థితి నెలకొంది. అరకులోయ మండలం కేంద్రం నుంచి సిరగం వరకు దాదాపు 15 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. కంకర రాళ్లు తేలి గుంతలు ఏర్పడటంతో అత్యంత ప్రమాదకరంగా మారింది. దీంతో పంచాయతీ వాసులు, వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు వద్ద పలుమార్లు మొర పెట్టుకున్నా ఫలితం లేదని పంచాయతీ ప్రజలు ఆరోపిస్తున్నారు. కోడిపుంజు వలస గ్రామం నుంచి మొదలుకొని శిరగం పంచాయతీకి వెళ్లే రోడ్డు మధ్యలో అంబులెన్స్ కుడా వెళ్లలేని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వాలు పాలకులు, అధికారులు మారుతున్నా రోడ్డు దుస్థితి మాత్రం మారలేదని వాపోతున్నారు. కంకర రాళ్లు తేలి గుంతలు పడిన రోడ్డు పై నిత్యం రాకపోకలు సాగిస్తున్నామని, కొన్ని సమయంలో ప్రమాదాలు సంభవించి హాస్పటల్ పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు సైతం మరమ్మతుకు గురవుతున్నాయని వాపోతున్నారు.అనారోగ్యం బారిన పడిన రోగులకు,గర్భిణులు ఆసుపత్రికి తీసుకెళ్ళడానికి రోడ్డు బాగోలేక అంబులెన్స్ సకాలంలో రాలేని పరిస్థితి నెలకొంద. ఈ రోడ్డు వేసి సుమారు 17 ఏళ్ళు కావస్తోందని, ఇప్పటికి కనీసం ఒక్కసారైనా మరమ్మతు చేపట్టలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వమైన స్పందించి రోడ్డు సదుపాయం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సిహెచ్‌డబ్ల్యూలకు వేతనాలు చెల్లించాలి

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి -పాడేరు: ఏజెన్సీలో పనిచేస్తున్న 725 కమ్యూనిటీ హెల్త్ వర్కరకు గత నాలుగు నెలల వేతనాలు చెల్లించాలని సిఐటియు అల్లూరి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్. సుందర్రావు మాట్లాడుతూ, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు నెలకు 4000 వేతనం ఐటిడిఏ చెల్లిస్తుందని, ఇచ్చే కొద్దిపాటి వేతనాలు నెలల తరబడి బకాయిలు పెట్టడంతో ఆర్థిక ఇబ్బందితో కొట్టుమిట్టులాడుతున్నారని తెలిపారు. గత కొంతకాలంగా కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని ఉద్యమిస్తున్నారని తెలిపారు. తక్కువ జీతంతో అయినా ఏ రోజైనా జీతాలు పెరుగుతాయని సొంత డబ్బులతో ఉద్యోగం చేస్తున్నారని తెలిపారు. తక్షణం బకాయి పడ్డ నాలుగు నెలలు వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ఐటిడిఏ ముందు ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

మెయిన్ రోడ్లలో అక్రమ కట్టడాల తొలగింపు

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి రంపచోడవరం
రంపచోడవరం, మారేడుమిల్లి మండల కేంద్రాలలో మెయిన్ రోడ్లకు ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం తొలగించడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో రంపచోడవరం, మారేడుమిల్లి మండలాల మండల రెవిన్యూ అధికారులు, రోడ్లు భవనాల శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులతో అక్రమ కట్టడాలు తొలగింపు విషయంపై గురువారం సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ సింహాచలం మాట్లాడుతూ రంపచోడవరం 1/70 చట్టానికి అనుగుణంగా అక్రమ కట్టడాలు తొలగించడం జరుగుతుందని చెప్పారు. ఈనెల 30వ తేదీ ఉదయం నుండి ఒక్కొక్క మండలానికి పది చొప్పున జెసిపిలు ఏర్పాటు చేసి టీంల ద్వారా అక్రమ కట్టడాలు తొలగించడం జరుగుతుందని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలు ఉన్న ఎడల వాటిని కూడా తొలగించాలని సూచించారు. కొంతమంది గిరిజన నేతలు ఈ ప్రాంత గిరిజనులకు ఇబ్బంది పడుతున్నారని తన దృష్టికి రావడం జరిగిందని, ఇటువంటి వాటిపై కూడా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. అక్రమ కట్టడాలు తొలగించే సమయంలో మెడికల్ టీంలు, అంబులెన్సులు, మహిళా పోలీసులను

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సింహాచలం, చిత్రంలో సబ్ కలెక్టర్, సబ్ డివిజన్ పోలీసు అధికారి

కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రోడ్డుకు ఇరువైపులా అక్రమ కట్టడాల్లో ఎవరైనా గిరిజనులు ఉంటే అటువంటి వారిని గుర్తించి ఒక ప్రాంతంలో స్థలం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ మాట్లాడుతూ రంపచోడవరం మండల కేంద్రంలో 340 మందికి, మారేడుమిల్లి మండల కేంద్రంలో 218 మందికి అక్రమ కట్టడాల విషయంపై నోటీసులు అందజేశామని తెలిపారు. ఎక్కడికక్కడ మార్కింగ్ ఇచ్చి అక్రమ కట్టడాలు తొలగించాలన్నారు. అక్రమ కట్టడాలు తొలగింపునకు ఈ ప్రాంత గిరిజనులు, గిరిజన నేతలు సహకరించాలని కోరారు. రోడ్డుకిరువైపులా ఎక్కడైనా చెట్లు ఉంటే వాటిని తొలగించవద్దని సూచించారు.

రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సాయి ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ రంపచోడవరం, మారేడుమిల్లి మండల కేంద్రాలలో రోడ్డుకి ఇరువైపులా అక్రమ కట్టడాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం తొలగించేందుకు ఎక్కడికక్కడ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా అతిక్రమించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దారు బాలాజీ, సిఐ రవికుమార్, ఎంపీడీవో యస్. శ్రీనివాసరావు దొర, డిప్యూటీ తహశీల్దారు శివ, శ్రీధర్, స్వామి, జిలాని, సబ్ ఇన్స్పెక్టర్లు వెంకట్రావు, షరీఫ్, పార్థసారథి, శ్రీనివాసరావు, వెంకటేష్, భూషణం, ఏఈలు శ్రీనివాసరావు, రాజశేఖర్, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్లు సిహెచ్ నిర్మల, ఏసుబాబు, మండల సర్వేయర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి మెయిన్ రోడ్డులో తొలగింపులు

ప్రజాశక్తి-మారేడుమిల్లి
మారేడుమిల్లి నుంచి భద్రాచలం, బోదులూరు వెళ్లే ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను రెవెన్యూ శాఖ సిబ్బంది గురువారం తొలగింపు చర్యలు చేపట్టారు. రహదారులకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, ఇళ్లకు సంబంధించిన వారికి మంగళవారం తుది నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకున్న 48 గంటల్లోపు ఆక్రమణలు తొలగించాలంటూ పేర్కొన్నారు. ఈ క్రమంలో గురువారం కొందరు తమ దుకాణాల ముందు ఉన్న రేకుల షెడ్ల తొలగింపు ప్రక్రియ చేపట్టారు. మరికొందరు మాత్రం ఇంకా వేచి చూసే దోరణిలో ఉన్నారు. నోటీసులు ఇచ్చిన రెవెన్యూ సిబ్బంది, ఆర్ అండ్ బి అధికారులు దగ్గరుండి రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించిన ప్రభుత్వ స్థలాలను, ఆక్రమణలు తొలగించాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేయడం జరుగుతుంది.

మారేడుమిల్లి-భద్రాచలం మెయిన్‌లో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ప్రధాన రహదారుల ఇరు పక్కల ఆర్ అండ్ బి స్థలాలలో అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించే ప్రక్రియ, రోడ్లు విస్తరణ పనులు ఈనెల 30న స్థానిక తహసీల్దార్ పి.రామకృష్ణ ఆధ్వర్యంలో జరుపుతున్న కారణంగా రంపచోడవరం, సిరిగిందలపాడు, మారేడుమిల్లి గ్రామాలకు శుక్రవారం ఉదయం 4 నుండి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.గాబ్రియేల్ తెలిపారు. రోడ్ల విస్తరణ పనులు పూర్తయిన తదానంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరుగుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని గాబ్రియేల్ తెలిపారు.

నేటి నుండి యథావిధిగా నైట్ సర్వీసు బస్సులు

ప్రజాశక్తి-సీలేరు : చతీస్‌ఘడ్‌లో ఇటీవల భారీ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో పోలీసుల ఆదేశాల మేరకు నిలిచిపోయిన నైట్ సర్వీసు బస్సులు శుక్రవారం నుండి పునరుద్ధరిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. యథావిధిగా నైట్ సర్వీస్ బస్సులు నడుపుకోవచ్చని పోలీసు అధికారులు ఆర్టీసీ అధికారులు సూచించడంతో విశాఖ వయా నర్సీపట్నం, సీలేరు నైట్ హాల్ట్, సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ బస్సులను శుక్రవారం నుంచి పునరుద్ధరించడానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

వేతన బకాయిలు చెల్లించకుంటే
ఎన్‌ఆర్‌ఇజిఎస్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం

ప్రజాశక్తి -సీలేరు
ఉపాధి హామీ పథకం కూలీ పనులు చేసిన కూలీలకు వేతన బకాయిలు ప్రభుత్వం తక్షణమే చెల్లించకుంటే ఎన్‌ఆర్‌ఇజిఎస్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి మురళి చంటిబాబు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీకే వీధి మండలం ఏ దారకొండ పంచాయతీ పరిధి గొల్లపల్లి, పెబ్బంపల్లి, తడకపల్లి, నల్లమోక, ఎ.దారకొండ, చిలక వీధి, దుర్గం, జాజుపాకలు గ్రామాలోత పాటు 16 పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులకు కూలీలకు వేతనాలు ప్రభుత్వం చెల్లించలేదని తెలిపారు. రెండు నెలల నుంచి పనులు నిర్వహిస్తున్న కూలీలకు కూలీ డబ్బులు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎన్‌ఆర్‌ఇజిఎస్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలి డబ్బులు చెల్లించకపోవడంతో కుటుంబ జీవనం గడవక అనేక ఇబ్బందులు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు స్పందించి తక్షణమే ఉపాధి కూలీ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిలకల సోమరాజు, మురళి శ్రీనుబాబు, పేతురు గంగరాజు, పెద్దబ్బాయి, సత్యమూర్తి, లక్ష్మయ్య, కూలీలు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు చేస్తున్న గిరిజనులు

నేడు పాడేరులో జాబ్ మేళా

ప్రజాశక్తి-పాడేరుటౌన్: ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో పాడేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 30న శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.రోహిణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ జాబ్ మేళాలో దాదాపు ఎనిమిది ప్రసిద్ధ కంపెనీలు పాల్గొని 500 పైగా ఉపాధి అవకాశాలు కల్పిస్తాయని తెలిపారు. 5వ తరగతి నుండి పదవ తరగతి, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ పూర్తి చేసిన వారంతా ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. ఆసక్తి వున్న 18 నుండీ 40 సంవత్సరాలు గల నిరుద్యోగ యువతీ, యువకులు ఆధార్ కార్డు, బయో డేటాతో పాటు విద్యార్హతల ధ్రువ పత్రాలతో హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాలకు 6302636174 లేదా 9949927899 ఫోన్ నెంబర్లకు సంప్రదించ వచ్చని పేర్కొన్నారు.

సెల్ సిగ్నల్స్ మెరుగుపరచాలి

నినాదాలు చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-పెదబయలు: మండలంలో వనభంగి పంచాయతీ కేంద్రంలో సెల్ సిగ్నల్ మూగబోయింది. సింగ్నల్ అందుబాటులో తీసుకు రావాలని గురువారం వనభంగి జనసేన పార్టీ యువ నాయకులు జాగరపు పవన్, జాగరపు జాన్, సురేంద్ర నరేష్ సెల్ టవర్ ముందు ఆందోళన చేసారు. ఎయిర్ టెల్ సెల్ టవరు నిర్మించి నాలుగు నెలలు గడచినా సిగ్నల్ అందలేదన్నారు. గ్రామంలో సెల్ టవర్ నిర్మించుటకు ఎటువంటి రుసుము తీసుకోకుండా ఉచితంగా స్థలం ఇచ్చామన్నారు. అత్యవసర సమయంలో 108 కు తెలియపరచి సహాయం పొందాలన్నా సెల్ సిగ్నల్ అందక వాహనాలు రాలేని పరిస్థితి నెలకొందన్నారు.

2, 3 తేదీల్లో
వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పర్యటన

ప్రజాశక్తి -భీమునిపట్నం : కేంద్ర వ్యవసాయ శాఖ నేతృత్వంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ (ఐసిఎఆర్)లోని విభాగాల వారీగా నిపుణులైన వ్యవసాయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కూడిన బృందం, జూన్ 2,3 తేదీల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో పర్యటించనుందని వ్యవసాయ శాఖ, భీమిలి అసిస్టెంట్ డైరెక్టర్ బొడ్డేపల్లి విజయప్రసాద్ గురువారం తెలిపారు.

2న పద్మనాభం మండలం కొవ్వాడ, మద్ది, బాందేవుపురం, 3న ఆనందపురం మండలం బోని, వెల్లంకి, ఆనందపురం గ్రామాల్లో శాస్త్రవేత్తల బృందం పర్యటించనున్నట్లు తెలిపారు. వరితోపాటు కూరగాయలు, పూలు, ఉద్యాన పంటలు విస్తారంగా పండించే గ్రామాలను వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పర్యటనకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పలు అంశాలపై రైతులకు వీరు అవగాహన కల్పిస్తారన్నారు. అనకాపల్లి జిల్లా, కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం అధ్వర్యంలో ఆధునిక వ్యవసాయ పద్ధతులు, కొత్త వంగడాలపై రైతులకు అవగాహన కల్పిస్తారని తెలిపారు.

అలరించిన సంగీత విభావరి

ప్రజాశక్తి- సీతమ్మధార : విశ్వవిఖ్యాత నటసార్వభౌమచ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా పౌర గ్రంథాలయంలో శారదా కళానికేతన్ ఆధ్వర్యంలో సంగీతవిభావరి నిర్వహించారు. ఎన్టీ రామారావు నటించిన సినిమాల్లో పాటలను గాయనీగాయకులు పాడి ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో శారదా కళానికేతన్ సంస్థ ప్రతినిధులు భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, రాములు ,ఇందిరా,పాల్గొన్నారు

మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

డిఎ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : డిఎల విషయంలో గత ప్రభుత్వం ఉద్యోగస్తులను మోసం చేసిందని, కూటమి ప్రభుత్వమైనా స్పందించి తక్షణమే డిఎల బకాయిలు చెల్లించాలని ఎపి జెఎసి అమరావతి అధ్యక్షులు బొప్పరాజు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలోని ఎన్‌జివోస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చిందన్నారు. ఆ మేరకు పిఆర్‌సి, ఐఆర్, పాత బకాయిల కోసం ఉద్యోగులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మీద గౌరవంతో బకాయిల కోసం కోర్టులకు వెళ్లడం లేదని స్పష్టం చేశారు. ఉద్యోగుల బకాయిల్లో కేవలం 10 శాతం మాత్రమే ఇచ్చారని, నాలుగు డిఎల బకాయిలు ఇవ్వాల్సి ఉందని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో జీతం ఎప్పుడొచ్చేదీ తెలిసేది కాదని, ఈ ప్రభుత్వంలో ఒకటో తేదీకి జీతం వస్తోందని చెబుతూ ఆనందం వ్యక్తం చేశారు. అయితే, కూటమి ప్రభుత్వం కూడా పిఆర్‌సి కమిషన్ వేయడానికి మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. వేరే రాష్ట్రాల్లో కోర్టులకు వెళ్లి డిఎల బకాయిలు సాధించుకున్నారని గుర్తు చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఆరేడు వేల కోట్లు, ప్రస్తుత ఉద్యోగులకు రూ.20 వేల కోట్ల వరకు ప్రభుత్వం బకాయిలు ఉందని వివరించారు. ఉద్యోగ ఆరోగ్య స్కీమ్.. ఉద్యోగ ఆరోగ్య స్కాంగా మారిందని విమర్శించారు. ఒక ఉద్యోగి అనారోగ్యంతో రూ.5 లక్షలు ఖర్చు చేస్తే రూ.90 వేల బిల్లు మంజూరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆరోగ్యం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఉద్యోగ సంఘాల నేతలకు సిఎం చంద్రబాబు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని చెప్పారు. సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎపి జెఎసి అమరావతి విశాఖ చైర్మన్ సత్తి నాగేశ్వరరావు రెడ్డి, కార్యదర్శి కెఎస్.రావు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కెప్టెన్ కూల్ పేరుతో డెటాల్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నగరంలో పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెక్‌కాన్ సంస్థ ప్రతినిధి ప్రసూన్ జోషి మాట్లాడుతూ డెటాల్ సబ్బులు, బాడీవాష్, హ్యాండ్ వాష్ శ్రేణి కోసం బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ క్రికెటర్ ఎంఎస్.ధోని ఉన్నారన్నారు.

10న విశాఖకు రాష్ట్రపతి రాక

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూన్ 10న విశాఖకు రానున్నారు. బీచ్ రోడ్డులో జరిగే కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం తొలి స్నాతకోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఇప్పటికే రాష్ట్రపతి పర్యటన వివరాలు విశాఖ కలెక్టరేట్‌కు అందాయి. జూన్ 10న ఉదయం 11.30 గంటలకు ద్రౌపది ముర్ము ప్రత్యేక విమానంలో ఢిల్లీ నుంచి విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. స్వాగత కార్యక్రమాల తర్వాత 11.40కి విమానాశ్రయం నుంచి బయలుదేరి రోడ్డు మార్గంలో 11.50కి బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్‌కు వెళ్తారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు అక్కడ జరిగే కేంద్రీయ గిరిజన విశ్వ విద్యాలయం తొలి స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు వేదిక వద్ద బయలుదేరి 1.20 గంటలకు ప్రత్యేక విమానంలో జార్ఖండ్ పర్యటనకు వెళ్లనున్నారు.

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ప్రతినెలా మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజ్ఞాన కేంద్రం చైర్మన్ వివిఎస్.పద్మనాభరాజు ప్రారంభించారు.

నిత్య జీవితంలో యోగా భాగం కావాలి

ప్రజాశక్తి అనంతగిరి:ప్రతిరోజు యోగా చేయడంతో సంపూర్ణన వంతమైన ఆరోగ్యంగా ఉండగలుగుతామని అరకు శాసనసభ్యులు రేగం మత్యలింగం అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ప్రతి పర్యాటక కేంద్రంలో యోగ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ప్రముఖ పర్యటక కేంద్రమైన బొర్రా గుహల ముఖ ద్వారం వద్ద జరిగిన యోగ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగ చేసుకోవడంతో ఆరోగ్యనికి ఎంతో మేలన్నారు.నిత్యజీవితంలో యోగా భాగం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీడీవో ఏవివి. కుమార్, ఇన్ సర్జి తహసిల్దార్ మాణిక్యం, ఆర్ఐ పి.శంకర్రావు పాల్గొన్నారు.

చింతూరు : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్ అన్నారు. చింతూరు శబరి నది ఒడ్డున గురువారం ఏర్పాటు చేసిన యోగాంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పిఒ మాట్లాడుతూ శారీరక మానసిక రుగ్మతలను నుండి కాపాడుకునేందుకు

యోగా చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీవో జగన్నాధరావు, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ పుల్లయ్య పాల్గొన్నారు.

సిమెంట్ ధరలు నియంత్రించకపోతే
భవన నిర్మాణాలు చేయలేం.!

- ట్రేడర్స్ సిండికేట్‌తో అనూహ్యంగా ధర పెరుగుదల
- ప్రభుత్వ జోక్యానికి బిల్డర్స్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి- పెందుర్తి :అనూహ్యంగా పెరిగిపోతున్న సిమెంట్ ధరలను నియంత్రించకపోతే భవిష్యత్తులో నిర్మాణాలు సాగించలేమని జివిఎంసి ఎనిమిదో జోన్‌లోని బిల్డర్స్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. మార్చి నుంచి నేటి వరకూ గడిచిన మూడు నెలల్లో పెరిగిన ధరలు యావత్తు నిర్మాణ రంగాన్నే భయపెట్టేవిలా ఉన్నాయంటూ అసోసియేషన్ పత్రికా ప్రకటనలో పేర్కొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆకాశాన్నంటిని ఇసుక ధరలను కిందకు తెచ్చి నిర్మాణరంగానికి ఇసుకను అందుబాటులోకి తెచ్చారనుకుంటే, సిమెంట్ ధరల అనూహ్య పెరుగుదల గందరగోళానికి గురిచేస్తోందన్నారు. మార్చి నెలలో రూ.250 దాకా ఉన్న సిమెంట్ బస్తా ఇపుడు రూ.370కి చేరిపోయిందని, ఇది అనూహ్య పెరుగుదల అన్నారు.

నిర్మాణ రంగానికి అతి కీలకమైన సిమెంట్ విషయంలో ట్రేడర్స్ సిండికేట్‌గా ఏర్పడి కృత్రిమ కొరతను సృష్టిస్తూ ధరల పెరుగుదలకు కారణమౌతున్నారని అసోసియేషన్ ఆరోపించింది. సిమెంట్ ధరలు ఇదే తరహాలో భవిష్యత్తులోనూ కొనసాగితే నిర్మాణ రంగం కుదేలైపోవడం ఖాయమన్నారు. కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న నిర్మాణ రంగాన్ని దెబ్బతీస్తున్న సిమెంట్ ధరల పెరుగుదలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని అసోసియేషన్ కోరింది. ధరలను నియంత్రించి, ఎందరికో ఉపాధిగాఉన్న భవన నిర్మాణ రంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని జోన్-8 బిల్డర్స్ అసోసియేషన్ కోరింది.

గంటల వ్యవధిలో తండ్రీకొడుకుల మృత్యువాత

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోనిగండిగుండం గ్రామంలో విషాద ఘటన చోటు చేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన తండ్రికొడుకులిద్దరూ 12 గంటల వ్యవధిలో మృత్యువాత పడడంపై గ్రామంలో విషదఛాయలు అలుముకున్నాయి. వివరాలివి.

గ్రామానికి చెందిన మదపాడ అచ్చిబాబు (80)కొన్ని రోజులుగా అస్వస్థతతో బాధపడుతున్నారు. డీహైడ్రేషన్ కారణంగా పరిస్థితి విషమించడంతో బుధవారం సాయంత్రం 7 గంటల సమయంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. తండ్రి మరణవార్త వార్త విని పెద్ద కుమారుడు మదపాడ బంగారయ్య (52) తీవ్రంగా కలత చెందాడు. గతంలో గుండె శస్త్రచికిత్స చేయించుకున్న బంగారయ్య అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు వెంటనే విశాఖపట్నంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గురువారం ఉదయం 7 గంటల

మృతులు తండ్రీ కొడుకులు అచ్చిరాజు, బంగారయ్య (ఫైల్)

సమయంలో ఆరోగ్యం విషమించడంతో బంగారయ్య కూడా తనువు చాలించాడు. బంగారయ్య వ్యవసాయ కూలిగా జీవనం సాగిస్తున్నాడు. . అతనికి భార్య అన్నపూర్ణ, ఇద్దరు కుమారులు మహేష్, రాజేష్ ఉన్నారు. కుమారులిద్దరూ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. తాతయ్య, తండ్రి మరణవార్త విన్న బంగారయ్య పెద్దకొడుకు మహేష్ కూడా తీవ్ర ఆందోళనకు గురై ఆసుపత్రిలో చేరాడు. భర్త, మామల మరణాన్ని తట్టుకోలేని అన్నపూర్ణ కూడా షాక్‌కు గురై ఆసుపత్రి పాలైంది. తండ్రి, కొడుకుల మరణం ఆ కుటుంబాన్ని తీరని విషాదంలో నింపడంతోపాటు, మరికొందరి కుటుంబసభ్యులు అనారోగ్యం పాలయ్యేలా చేయడంపై గ్రామంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులైతే శోకంలో మునిగిపోయారు. అచ్చి బాబు రెండవ కుమారుడు మదపాడ శ్రీను తండ్రి, అన్నయ్య మృతదేహాలకు గంట వ్యవధిలో దహన సంస్కారాలను నిర్వహించారు. గ్రామస్థులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు.గంటల వ్యవధిలోనే ఇంటి పెద్దలు, కుటుంబపోషణధారం కోల్పోవడంతో గ్రామమంతా దిగ్భ్రాంతికి గురైంది. తీవ్ర విషాదఛాయలు నెలకొన్నాయి.

ఐక్యంగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలి

బిజెపి మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం దారుణం
సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం
అనకాపల్లిలో సమైక్యతా యాత్ర

సమైక్యతా యాత్రలో పాల్గొన్న లోకనాథం, కోటేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి - అనకాపల్లి : ఉగ్రవాదం, మతోన్మాదం, యుద్ధోన్మాదాలను ఐక్యంగా ఎదుర్కోవాలని, లౌకికతత్వం, మతసామరస్యాన్ని కాపాడుకోవాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం పిలుపునిచ్చారు. మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణకు సిపిఎం చేపట్టిన సమైక్యతా యాత్ర గురువారం అనకాపల్లిలో ఉత్తేజంగా సాగింది. సిపిఎం కార్యాలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా నాలుగు రోడ్ల జంక్షన్ వరకూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉగ్రవాదం, మతోన్మాదానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభకు పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సభను ఉద్దేశించి లోకనాథం మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని సమైక్యంగా ఎదుర్కోవాల్సిన సమయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనార్టీలపై వ్యతిరేకతను నూరిపోస్తోందన్నారు. పర్యవసానంగా ఇటీవల కాలంలో ముస్లిములపై 112 దాడులు జరిగాయని తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి జరిగిన సమయంలో మతాలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా బాధితులకు సాయం చేశారని, అటువంటి వారికి అభినందనలు తెలపాల్సిన ప్రధాని తీవ్ర వ్యతిరేకతను రెచ్చగొడుతున్నారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో ఉగ్రవాదులను అంతమొందించామని చెబుతున్నారని, గతంలో సర్జికల్ స్ట్రైక్ పేరుతోనూ ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని చెప్పారని, మరి ఇప్పటి ఉగ్రవాదులు ఎక్కడ నుండి వచ్చారని లోకనాథం ప్రశ్నించారు. అత్యంత సున్నిత ప్రాంతమైన పహల్గాంలోకి ఉగ్రవాదులు ఎలా చొరబడ్డారో కేంద్రం ఇప్పటి వరకూ బయట పెట్టలేదన్నారు. వారిని పట్టుకోలేదని, పైగా ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేసిన సోఫియా ఖురేషిని ఉగ్రవాదుల సోదరిగా బిజెపి నాయకులు వర్ణించడం అత్యంత సిగ్గుచేటైన విషయమని అన్నారు. దీన్ని కప్పిపుచ్చుకునేందుకు మోడీ సోఫియా కుటుంబ సభ్యులతో ప్రదర్శన జరిపి రాజకీయం చేశారని అన్నారు. బిజెపికి మద్దతు ఇస్తున్న జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ముస్లిములు పాకిస్తాన్‌కు వెళ్లిపోవాలంటూ ముస్లిం వ్యతిరేకతను మరింత రెచ్చగొడుతున్నారని అన్నారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న ఆయన ఇలా మాట్లాడటం సరికాదన్నారు. లౌకికపార్టీ అని చెప్పుకుంటున్న టిడిపి కూడా దీనికి సమాధానం చెప్పాలన్నారు. సిపిఎం దేశంలో సమైక్యతకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ని ఆపేస్తున్నారని ప్రకటన చేయడానికి ట్రంప్ ఎవరని ప్రశ్నించారు. బిజెపి నాయకుల తీరు అత్యంత దారుణంగా ఉందన్నారు. సైనికులు, ప్రజలు మోడీ కాళ్లకు దండం పెట్టాలని చెబుతున్నారని, ఇంతకంటే దుర్మార్గం మరొకటి లేదని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న, గంటా శ్రీరామ్, గనిశెట్టి సత్యన్నారాయణ, ఆర్.శంకరరావు, పార్టీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విశాఖ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2024-25 సంవత్సరానికి నిర్వహించిన ఎస్ఒఎఫ్ ఒలింపియాడ్ పరీక్షలో విశాఖపట్నానికి చెందిన ముగ్గురు విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచారని ఎస్ఒఎఫ్ వ్యవస్థాపక డైరెక్టర్ మహాబీర్ సింగ్ తెలిపారు. గురువారం ఉదయం పెదవాల్తేరులోని ఓ ప్రయివేటు స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ పరీక్షలో విశాఖలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నుండి శ్రేయాన్స్ కుమార్ సింగ్ అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్‌లో మొదటి ర్యాంకు సాధించి బంగారు పతకం, మెరిట్ సర్టిఫికెట్ పొందారని, అదేవిధంగా టింపనీ పాఠశాలకు చెందిన బి.సుహాస్ అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్‌లో రెండో ర్యాంకు సాధించి వెండి పతకం, మెరిట్ సర్టిఫికెట్‌ను. ప్రియాంక విద్యాయోదయ ఉన్నత పాఠశాల నుండి వచ్చిన కాండ్రపు వంశీ కృష్ణారెడ్డి అంతర్జాతీయ గణిత శాస్త్ర ఒలింపియాడ్‌లో మూడవ ర్యాంకును సాధించి మెరిట్ సర్టిఫికెట్‌తో కాంస్య పతకాన్ని సాధించారని వెల్లడించారు. ఈ సంవత్సరం ఎస్ఒఎఫ్ ఒలింపియాడ్‌లో విశాఖపట్నం నుండి 45600 మందికిపైగా విద్యార్థులు సహా 70 దేశాల నుండి సుమారు మిలియన్ల మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు.

కెకె లైన్‌లో కొనసాగుతున్న పునరుద్ధరణ పనులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేర్ డివిజన్ పరిధిలోని కోరాపుట్ - కొత్తవలస విభాగం (కెకె లైన్)లో తైడా - చిమిడిపల్లి ప్రాంతాల మధ్య భారీ వర్షాలకు 53/54 మైలురాయి వద్ద కొండ చరియలు విరిగిపడటంతో ఆ మార్గం గుండా ఇనుప ఖనిజం లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పిన క్రమంలో తలపెట్టిన పునరుద్ధరణ పనులు గురువారమూ కొనసాగాయి. ఆ పనులను డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా, ఎడిఆర్ఎం ఇన్‌ఫ్రా ఇ.శాంతారామ్ పర్యవేక్షించారు. పునరుద్ధరణ పనుల నేపథ్యంలో 58501 విశాఖపట్నం - కిరండోల్ ప్యాసింజర్, 58502 కిరండోల్ - విశాఖపట్నం ప్యాసింజర్, 18516 కిరండోల్ - విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్‌లను మే 30వ తేదీన, 18515 విశాఖపట్నం - కిరండోల్ నైట్ ఎక్స్‌ప్రెస్‌ను మే 29న రద్దు చేశారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గుర్తించాలని అధికారులు కోరారు.

అనాథ, నిరాశ్రయ బాలలకు ఆధార్ కార్డులు

డిఎల్ఎస్ఎ అధ్యక్షులు చిన్నంశెట్టి రాజు

ప్రజాశక్తి-పాడేరు:ఆంధ్ర ప్రదేశ్ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఉన్న అన్ని మండలాలలో ఉన్న అనాథ, నిరాశ్రయ బాలలను సర్వే ద్వారా గుర్తించడం, వారికి ఆధార్ కార్డులు ఇప్పించడం జరుగుతుందని విశాఖపట్నం జిల్లా న్యాయ సేవా ప్రాదికారిక సంస్థ అధ్యక్షులు జస్టిస్ చిన్నంశెట్టి రాజు గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ నెల 25 వ తేదీ నుండి జూన్ 25 వ తేదీ వరకు అన్ని గ్రామాల పరిధిలో ఉన్న అంగన్వాడి టీచర్స్, ఆశా వర్కర్స్ ఏఎన్ఎంలు, విద్యశాఖ, సచివాలయం, పోలీస్, రెవిన్యూ సిబ్బంది, ఎన్జీవో ఎన్జీవోల ద్వారా అనాధ బాలలను గుర్తించి, ఆయా మండల కేంద్రాలలో మండల తహసీల్దార్ పర్యవేక్షణలో ఆధార్ కార్డులు ఇప్పించడం జరుగుతుందని అధ్యక్షులు వివరించారు. అదేవిధంగా, అనాధ, నిరాశ్రయ బాలలకు అర్హతల మేరకు కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రజలందరూ అనాధ, నిరాశ్రయ బాల బాలికల సమాచారాన్ని అంగన్వాడి, ఆశా, ఏ ఎన్ ఎం లు, విద్యశాఖ, సచివాలయం, పోలీస్, రెవిన్యూ సిబ్బందికి అందజేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు చిన్నంశెట్టి రాజు, కార్యదర్శి సన్యాసి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:మండలంలోని బొండం పంచాయితీ మజ్జివలస జంక్షన్ నుండి బొండం గ్రామం వరకు రోడ్డు పనులు ప్రారంభించాలని జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా చైర్మన్ పంచాడి రాజేష్ అన్నారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం హయాంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని, పనులు పూర్తి చేయకుండా కంకర రాళు పోసి మధ్యలోనే గుత్తేదారుడు పనులు వదిలేయడంతో గిరిజనులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వర్షాల కారణంగా రోడ్డు కోతకు గురై ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి పనులు ప్రారంభించి రోడ్డు సదుపాయం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లాలో కోవిడ్ మరణాలు లేవు

విశాఖ జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు

ప్రజాశక్తి- సీతమ్మధార : జిల్లాలో తాజాగా ఎటువంటి కోవిడ్ మరణాలు చోటుచేసుకోలేదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ .పి.జగదీశ్వరరావు వివరణనిచ్చారు. విశాఖలో కోవిడ్ వ్యాధితో 60ఏళ్లు దాటిన వ్యక్తి మృతి చెందినట్లు కొన్ని పత్రికల్లో వార్తలు వచ్చిన నేపథ్యంలో ప్రజలు భయాందోళనకు గురికాకుండా ఉండేందుకు దీనిపై స్పష్టతనిస్తూ ప్రకటన విడుదల చేశారు.

జిల్లాలో ఇప్పటివరకు ఎటువంటి కోవిడ్ మరణాలు జరగలేదన్నారు. పత్రికల్లో వచ్చినట్లు న్యుమోనియా, పార్కిన్సన్స్ వ్యాధి, అధికరక్తపోటు, మధుమేహం వంటి పలు కారణాలతో మృతి చెందాడని అంటున్నారని, అటువంటి సమాచారం కూడా తమ వద్ద లేదన్నారు. . కోవిడ్ మరణాన్ని ధ్రువీకరించాలంటే కెజిహెచ్‌లో విడిఆర్ఎల్ ల్యాబ్‌లో ఆర్‌టిపిసిఆర్ టెస్ట్ పాజిటివ్‌గా నిర్ధారణ కావాల్సి ఉంటుందన్నారు. ప్రజలెవరూ భయాందోళనలకు గురి కానవసరం లేదన్నారు. అయినప్పటికీ కోవిడ్ నియమనిబంధనల ప్రకారం మాస్క్ ధరించడం, శానిటైజర్ వినియోగించడం వంటివి చేయాలని సూచించారు.

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనపై అవగాహన

ప్రజాశక్తి- మాధవధార : ఎపిఇపిడిసిఎల్ రెండో జోన్ పరిధిలో గల ఎన్ఎస్‌టిఎల్ సెక్షన్‌లో విశాఖపట్నం ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంబాబు ఆధ్వర్యంలో గురువారం మాధవధారలో ఇంటింటికీ వెళ్లి ప్రధా మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఇంటి పైకప్పుపైనే సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకొని, ఇంటికి సరిపడా విద్యుత్‌ను వాడుకోవచ్చుని, దీనికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని వివరించారు. అవసరానికి మించి ఎక్కువైన విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించి, ఆదాయం కూడా పొందవచ్చన్నారు. సాంప్రదాయ విద్యుత్ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడం, పర్యావరణ హితమైన విద్యుత్‌ను ప్రోత్సహించడం కోసం కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. సోలార్ ప్యానెల్స్ పెట్టుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తుందన్నారు. స్థానిక ఎఇఇ వెంకటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

బురదమయంగా ఉన్న రహదారి

అమ్మిరేకుల రహదారి అధ్వానం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని అమ్మిరేకుల తుమ్మలగడ్డ వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రయాణికులు, గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజవొమ్మంగి నుండి అమ్మిరేకుల వెళ్లే రహదారిలో కొత్తవీధి, కిమ్మలగెడ్డ, ముర్లవారి వీధి గ్రామాలకు చెందిన వందలాదిమంది గిరిజనులు రోజు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రహదారి దమ్ముమడిని తలపించేలా నడవడానికి సైతం వీలు లేకుండా ఉందని ఆయా గ్రామాల గిరిజనులు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల ఈ రహదారికి కొంతమేర బీటి రహదారి పనులు చేపట్టారు. మధ్యలో అసంపూర్తిగా వదిలేయడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ గోడు అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బురదమయంగా మారిన నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు

ప్రజాశక్తి-రంపచోడవరం : గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమం పాఠశాలలో పనిచేయుచున్న ఉపాధ్యాయులకు, ఇతర సిబ్బందికి ఈనెల 30, 31 తేదీల్లో ప్రభుత్వ నిబంధన ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికి బదిలీలు చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. గురువారం సాయంకాలం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ ఉపాధ్యాయుల సంఘాలతో బదిలీల కౌన్సిలింగ్‌పై పిఒ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.రుక్మండయ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ ఉపాధ్యాయులు, నాలుగో తరగతి సిబ్బంది, ఇతర సిబ్బంది ఒకే చోట ఐదు సంవత్సరాలు పనిచేసి దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈనెల 30వ తేదీన ఉదయం 10 గంటల నుండి నాలుగో తరగతి ఉద్యోగులకు, 31న ఉపాధ్యాయులకు ఐటీడీఏ సమావేశపు హాల్లో బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ బదిలీల కౌన్సిలింగ్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎటువంటి తప్పులకు తావివ్వకుండా అన్ని ఉపాధ్యాయుల సంఘాల సమక్షంలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా కౌన్సిలింగ్ నిర్వహించాలని, కొన్ని పాఠశాలలు మార్చవలసి ఉంటుందని వివిధ ఉపాధ్యాయ సంఘాలు తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రామ తులసి, కృష్ణమోహన్, జల్లి శంభుడు, డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ బి.కిషోర్, వివిధ ఉపాధ్యాయుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

సందడిగా 'థగ్ లైఫ్' సినీ ఈవెంట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : కమల్ హాసన్ హీరోగా, లెజెండరీ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో, ఆస్కార్ విజేత ఎఆర్ రెహమాన్ సంగీత సారథ్యంలో ఈ హై-వోల్టేజ్ గ్యాంగ్‌స్టర్ డ్రామాగా నిర్మించిన 'థగ్ లైఫ్' చిత్రం జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో గురువారం సాయంత్రం సిరిపురంలోని గురజాడ కళాక్షేత్రంలో నిర్మాతలు ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఇది ఎంతో సందడిగా సాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూనివర్సల్ హీరో కమలహాసన్ మాట్లాడుతూ తన 21 ఏళ్ల వయసు నుండి విశాఖలో ఎన్నో చిత్రాల షూటింగ్‌లు నిర్వహించినట్టు గుర్తుచేసుకున్నారు. ఈ నగరం ఎంతో ప్రత్యేకమైనదన్నారు.